క్లుప్తంగా

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

దహెగాం: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సనత్‌కుమార్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగను కుటుంబాలతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ తీగలు ఉన్నచోట గాలిపటాలు ఎగురవేయవద్దన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడాదుస్తులతో యువకులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారులకు శనివారం గ్రామ సర్పంచ్ చౌదరి సుజాత శ్రీనివాస్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి తన వంతు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కేబాబు, యువకులు మోయిన్, రమేష్, తాజ్, వెంకటేష్, వెంకీ, చారి తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి అన్నారు. మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు శనివారం సాయంత్రం ముగిశాయి. ఆమె గెలుపొందిన జట్లకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్, బీజేపీ మండల అధ్యక్షుడు నారులే వానుపటేల్, నాయకులు బొమ్మకంటి మహేష్, లింగేశ్వర్, తిరుపతి, ప్రదీప్, భూషన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

నేరడిగొండ: క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్‌లో శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి క్రీడాకారులను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంధం నవీన్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, గాదె శంకర్, వీడీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాం రాజేశ్వర్, ఉప్పు పోశెట్టి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి సుభాష్‌నగర్ బస్తీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం గోదారంగనాయకుల స్వామి కల్యాణవేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కల్యాణ వేడుకలను తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు దామోదర చార్యులు, ఆలయ పూజారి రామకృష్ణచార్యులు, సందీప్ చార్యులు, రాజేష్ శర్మ వివాహ తంతును నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆసం ఏడుకొండలు, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ వైస్ చైర్మన్ ఆర్.గంగారాం, మోరా మోక్షానందం, దేవాలయ కమిటీ సభ్యులు ఎస్.రఘు, జాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో(రూ.లో)
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	30
టమాట	20
బీరకాయ	60
కాకరకాయ	40
బెండకాయ	40
అలసంత	40
దొండకాయ	80
మిర్చి	80
సొరకాయ	80
చిక్కుడుకాయ	60
గోబి (పూల్)	40
క్యాబేజి	60

– ఆసిఫాబాద్‌అర్బన్

సినిమాలు

ఆసిఫాబాద్ (కుమురం భీం):
వీరసింహారెడ్డి/వాల్తేరు వీరయ్య
కాగజ్‌నగర్ (వెంకటరమణ):
వీరసింహారెడ్డి/ వాల్తేరు వీరయ్య


కాలినడకన ఆలయానికి వస్తున్న మహారాష్ట్ర భక్తులు


జంగుబాయి గుహ ఎదుట వేచి ఉన్న భక్తులు


టొప్లకసకు దోలెతో వెళ్తున్న భక్తులు


పెద్దలతో సంప్రదాయ భేటీ జరుపుతున్న మహిళలు


రావుడ్ దేవతల ఎదుట భక్తుల జన సందోహం

‘అమ్మ’కు నీరా‘జనం’

కెరమెరి మండలంలో జంగుబాయి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతీరోజు ఆదివాసీలు తండోపతండాలుగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. శనివారం ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల వాసులు సైతం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇప్పటి వరకు సుమారు 300 వరకు మోళాలు, 2 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొడప జాకు, గౌరవ అధ్యక్షుడు మరప బాజీరావు తెలిపారు. – కెరమెరి

భక్తుల కొంగు బంగారం ‘గొంతెమ్మ’


మెరెగూడ సమీపంలో వెలసిన గొంతెమ్మ తల్లి

- గౌతమి చెరువు ప్రాంతంలో వెలసిన దేవత
- నేడు పవిత్ర స్నానాలు.. రేపు బోనాలు

పెంచికల్‌పేట్: పచ్చని ప్రకృతి ఒడిలో మెరెగూడ గ్రామంలోని గౌతమి చెరువు సమీపంలో వెలసిన అతిపురాతన గొంతెమ్మ (కుంతి దేవి)ఆలయంలో బోనాల పండుగ సోమవారం నిర్వహించేందుకు గిరిజనులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేల సంవత్సరాల క్రితం వెలసిన గొంతెమ్మ తల్లి భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతుంది. ప్రతీ ఏడాది ఆలయంలో సుమారు 15 రోజులపాటు గిరిజనులు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాల జాతర నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ.

గ్రామ దేవతల ఊరేగింపు..

ఆలయంలో గొంతెమ్మతో పాటు పంచపాండవులు, నీలవరుడు, పోతురాజు, లక్ష్మీదేవర, కృష్ణస్వామి, గిరిపోతుల విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. జాతరలో భాగంగా ఈ విగ్రహాలను మండలంలోని అగర్‌గూడ, ఎల్లూర్, కోయచిచ్చాల, పెంచికల్‌పేట్, ఎల్కపల్లి, సంజీవనగర్, లోడుపల్లి గ్రామాల్లోని వీధుల్లో విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు అమ్మవారు చల్లగా చూడాలని సారె అందించారు. ప్రతీరోజు సాయంత్రం గ్రామాల్లో అమ్మవార్ల వేషధారణలో భాజాభజంత్రీలతో ఆటపాటలతో ఆలయ చరిత్రను అమ్మవార్ల మహిమ వివరించారు.

పవిత్ర స్నానాలు..

గ్రామాల్లో ఊరేగింపు అనంతరం 14వ రోజు(నేడు) దట్టమైన అటవీప్రాంతంలో వెలసిన సిద్దేశ్వర ఆలయ సమీపంలోని పవిత్ర నీటి గుండాల్లో దేవతామూర్తులకు పవిత్ర స్నానాలు నిర్వహించనున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి ఆలయంలో కొలువుదీరుస్తారు. 15వ రోజు సోమవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయంలో గిరిజనులే పూజారులుగా నీతి, నియమాలతో కనుల పండువగా జాతర నిర్వహిస్తారు.

మహిమ గల తల్లి

ఆలయంలో వెలసిన పురాతన గొంతెమ్మ తల్లి ఎంతో మహిమగలది. పురాతన కాలం నుంచి మా కుటుంబానికి చెందిన వారిమే పూజార్లుగా తల్లిని కొలుస్తున్నాం. ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలతోనే అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్నాం. ఆలయం ప్రాంగణంలో భక్తులు బోనాలు సమర్పిస్తారు.

– మానెపల్లి రాజన్న, ఆలయ ప్రధాన పూజారి

దుమ్ముతో పరేషాన్!

- ఇష్టారీతిన నాలుగు వరుసల రహదారి పనులు
- వాహనాల రాకపోకలతో భారీగా లేస్తున్న దుమ్ము
- ఇబ్బందులు పడుతున్న దుకాణాదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు


వాంకిడి మండల కేంద్రంలో సర్వీసు రోడ్డుపై లేస్తున్న దుమ్ము

వాంకిడి: మంచిర్యాల నుంచి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామం గోయెగాం వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి –363 నిర్మాణంలో జాప్యం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేదాది ప్రారంభించిన పనులు నేటికీ సాగుతూనే ఉన్నాయి. పనుల్లో నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకల కారణంగా రోడ్డుపై దుమ్ము లేస్తుండడంతో వ్యాపారస్తులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఇష్టారీతిన నిర్మాణం..

రహదారి నిర్మాణంలో భాగంగా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారికి ఇరువైపులా ప్రత్యామ్నాయంగా బీటీతో సర్వీసు రోడ్డు నిర్మించాల్సి ఉంటుంది. ముందుగా నాణ్యతతో కూడిన మొరం మట్టితో చదును చేసి దుమ్ము లేవకుండా ప్రతీరోజు నీళ్లు పట్టాల్సి ఉంటుంది. అనంతరం బీటీతో పనులు చేపట్టాలి. కానీ ఒక పక్కన బీటీతో సర్వీస్ రోడ్డు నిర్మించి మరో పక్కకు నాసిరకం మట్టితో రోడ్డు నిర్మించి వదిలేశారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు నుంచి సీఎఫ్‌సీ (కామన్ ఫెసిలిటీ సెంటర్) వరకు మట్టితో ఏర్పాటు చేసిన రోడ్డుపై దుమ్ము లేవకుండా సదరు కాంట్రాక్టర్ ట్యాంకర్‌ల ద్వారా నీళ్లు పట్టాల్సి ఉంటుంది. కానీ రెండు, మూడు రోజులకు ఒకసారి మాత్రమే మట్టి రోడ్డుపై నీళ్లు పడుతుండటంతో వాహనాల రాకపోకలతో భారీగా దుమ్ము లేస్తుంది. రోడ్డు పక్కనున్న దుకాణాలు, నివాసాలు దుమ్ము పడుతున్నాయి. ప్రతీరోజు ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రజలు దుమ్ము భరించలేకపోతున్నారు. పలుమార్లు సమస్యను సైట్ ఇంజనీర్లు, మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని స్థానికులు వాపోతున్నారు. సమస్యపై ఎస్‌హెచ్‌ఏఐ ఏఈను చరవాణి ద్వారా వివరణ కోరగా మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో రహదారి పనులు పూర్తవుతాయని, మట్టి రోడ్డుపై దుమ్ములేవకుండా నీళ్లు పట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దుమ్ము భరించలేకపోతున్నాం



రహదారికి పక్కనే ఓ అద్దె రూంలో బైక్ మెకానిక్ దుకాణం నడుపుతున్నాను. రహదారి పనుల్లో భాగంగా దుకాణం ముందు నుంచి మట్టితో సర్వీసు రోడ్డు నిర్మించారు. రోడ్డుపై నీళ్లు పట్టకపోవడంతో వాహనాల రాకపోకలతో విపరీతంగా దుమ్ము లేస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– హిప్రై భరత్, మెకానిక్

అధికారులు చర్యలు తీసుకోవాలి



దుమ్ము లేవకుండా నీళ్లు పట్టాలని సూపర్‌వైజర్లకు, సైట్ ఇంజనీర్లకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అడపాదడపా నీళ్లు పట్టి వదిలేస్తుండటంతో భారీగా దుమ్ము లేస్తుంది. దుకాణమంతా దుమ్ము పట్టిపోతోంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– సాయి, కటింగ్‌షాప్ నిర్వాహకుడు

ఉత్సాహంగా సాగిన కబడ్డీ పోటీలు


ఫైనల్‌లో తలపడుతున్న జట్లు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో జీఎస్‌ఆర్ ఫౌండేషన్ సహకారంతో హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో మొత్తం 15జట్లు పాల్గొన్నాయి. సంక్రాంతి సెలవులు కావడంతో పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో జనం విచ్చేయడంతో పండగ వాతావరణం కనిపించింది. విజేతలకు శనివారం సాయంత్రం బహుమతులు అందించారు. జీఎస్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రాజరమేష్, క్లబ్ నిర్వాహకులు శ్రీనివాస్, ఆయా పార్టీల నాయకులు గాండ్ల సమ్మయ్య, గోపతిరాజయ్య, రఘునాథ్‌రెడ్డి, మహంకాళి శ్రీనివాస్, పొన్నాల సాగర్, బద్రి సతీష్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు అందజేత

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లిలో కబడ్డీ క్రీడాకారులకు, కబడ్డీ మ్యాట్, షూ కొనుగోలుకు సర్పంచ్ రజనీ రూ.5వేల నగదును శనివారం అందించారు. కార్యక్రమంలో స్థానికులు, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

మన ఊరు.. మన బడి పనులు పూర్తి చేయాలి

నార్నూర్: మన ఊరు.. మన బడి కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న పనులను పూర్తి చేయాలని కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగీర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించి వేగవంతం చేయాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కంకర లారీ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. కౌటాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సూపర్‌లగ్జరీ బస్సును కౌటాల వైపు వస్తున్న కంకర లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రయాణికులెవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని లక్ష్మీ థియేటర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఛత్రపతి విగ్రహ సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సాధన సమితి సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో రాము మాట్లాడుతూ గత 10నెలల నుంచి విగ్రహ స్థలం కోసం అనేక సార్లు అధికారులకు మెమోరాండం ఇచ్చినా, ఇప్పటి వరకు స్థలాన్ని కేటాయించలేదన్నారు. శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

యువజన కళా ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: హైదరాబాద్ పట్టణంలోని నాంపల్లి సమీపంలో గల నందమూరి రామారావు కళామందిర్‌లో ఈ నెల 22న శ్రీ కళావేదిక యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే యువజన కళా ఉత్సవ్ పోస్టర్‌ను ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ కళావేదిక యువజన విభాగం వారు యువకళాకారులు, రచయితలు, డ్యాన్సర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న యువజన కళా ఉత్సవ్‌ను యువ కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ కళావేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మామిడి అక్షిత, రచయితలు దబ్బెట రాయమల్లు, బొద్దు మహేందర్, లక్ష్మీనానరాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ ఆందోళన

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గనుల డిపార్ట్‌మెంట్‌లపై శనివారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు అందించారు. కేకే–1 గని మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించిన ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు సుదర్శన్ మాట్లాడుతూ.. మందమర్రి ఏరియాలో కార్మికులు తక్కువగా ఉండి క్వార్టర్‌లు ఎక్కువగా ఉన్నా, కొంత మందికి సౌకర్యాలు ఉన్న క్వార్టర్లు యాజమాన్యం కేటాయించలేక పోతుందని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు సౌకర్యాలు ఉన్నటువంటి క్వార్టర్లను కబ్జా చేసి దర్జాగా ఉంటున్నారని మండిపడ్డారు. సింగరేణి క్వార్టర్స్‌లలో నుంచి కార్మికేతరులను ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్ చిట్టీలు వెంటనే పంపిణీ చేయాలని, పాత పద్ధతిలోనే లీవులు, ప్లేడేలు అమలు చేయాలని, నాణ్యమైన పరికరాలు అందించాలని, స్వెట్టర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజేషం, తిరుపతి, ప్రభాకర్, సీహెచ్ పీ శర్మ, కుమార్, మనోహర్ తదితరులు ఉన్నారు.

సంక్రాంతి సందడి


రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలో సంక్రాతి పండుగ సందడి నెలకొంది. ఇళ్ల ముందు ముగ్గులు వేసేందుకు శనివారం వివిధ రంగులు కొనుగోలు చేశారు. గ్రామాల్లో పిల్లలు గాలిపటాలు ఎగరేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు.

డంపింగ్ యార్డుకు నిప్పు

రామకృష్ణాపూర్: స్థానిక ఆర్‌కే1 గని సమీపంలోని పాత టింబర్‌యార్డు వద్ద గల డంపింగ్ యార్డుకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి నిప్పుపెట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సమీపంలోని కనకదుర్గాకాలనీ, తిలక్‌నగర్, ఏజోన్ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. విషయం తెలుసుకున్న 2వ వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ వాటర్ ట్యాంకర్లను తెప్పించి మంటలు ఆర్పించారు. కాగా ఇటీవల తరచూ డంపింగ్ యార్డులో మంటలు చెలరేగి సమీప ప్రాంత వాసులు పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899